సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025



సోమశిలలో 52.737 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 52.737 టీఎంసీలు నీరు నిల్వ ఉంది. దిగువ రెండు కాలువలకు 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.91,200
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.8,285
3 శాతం జీఎస్టీతో	రూ.8.534
నవర (8 గ్రా)	రూ.68,272

గరిష్టం/కనిష్టం 38.0 /27.0

వాతావరణం

జిల్లాలో వాతావరణం మంగళవారం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 51 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

జిల్లా జడ్జి యామిని బదిలీ



జిల్లా జడ్జి సి.యామిని

నెల్లూరు (లీగల్): నెల్లూరు జిల్లా జడ్జి సి.యామిని వైఎస్సార్ జిల్లా జడ్జిగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో అనంతపురం జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ నియమితులయ్యారు. నెల్లూరు ఆరో అదనపు జిల్లా (ఫ్యామిలీ కోర్టు) జడ్జి వెంకట నాగపవన్ గూడూరు ఏడో అదనపు జిల్లా జడ్జిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తూర్పుగోదావరి జిల్లా కాకినాడ ఆరో అదనపు జిల్లా జడ్జి నిఖిత ఆర్‌ఓరా నియమించారు. నెల్లూరు జిల్లా గూడూరు ఏడో అదనపు జిల్లా జడ్జి షమీ పర్వీన్ సుల్తానాబేగంను గుంటూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జిగా నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా 54 మంది జిల్లా జడ్జిలు, అదనపు జిల్లా జడ్జిలను బదిలీ చేస్తూ రాష్ట్ర హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కార్మికులకు పీఎం జన ఆరోగ్య యోజన

నెల్లూరు (పొగతోట): అసంఘటిత రంగాల్లో పని చేస్తున్న కార్మికులు ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన పథకం కింద పేర్లు నమోదు చేసుకోవాలని ఉప కార్మిక కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7 నుంచి 17వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ పథకం కింద పేర్లు నమోదు చేసుకున్న కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించబోయే ఆరోగ్య, సంక్షేమ, ఆర్థిక ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. పేర్ల నమోదు కోసం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాలను కార్మికులందరూ ఉపయోగించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 94925 55114, 94925 55126 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఉద్యోగ నియామక పత్రాలు అందజేత



విభిన్న ప్రతిభావంతులకు నియామక పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: విభిన్న ప్రతిభావంతులకు కలెక్టర్ ఆనంద్ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2022–23 సంవత్సరానికి సంబంధించి జారీ చేసిన ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా అంధులు, బధిరులు, శారీరక వైకల్యం ఉన్న వారిని ఎంపిక చేసి లైబ్రరీ అసిస్టెంట్, టెక్నికల్ విభాగంలో టైపిస్ట్, కామాటి, ఫిట్టర్, కూలి, పీహెచ్ వర్కర్ తదితర ఆరు పోస్టులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ సహాయ సంచాలకులు మహమ్మద్ అయూబ్ పాల్గొన్నారు.

కోవూరు షుగర్స్ సమస్యకు పరిష్కార చర్యలు

- ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



కోవూరు చక్కెర కర్మాగారం రైతులు, కార్మికులు, షేర్ హోల్డర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరు రూరల్: కోవూరు చక్కెర కర్మాగారం సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో చక్కెర కర్మాగారం రైతులు, కార్మికులు, షేర్ హోల్డర్లతో కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే, కలెక్టర్ మాట్లాడుతూ కార్మికులకు బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం కూడా సుముఖత వ్యక్తం చేసిందని చెప్పారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీకి సంబంధించి సుమారు 124 ఎకరాల భూములను ఏపీఐఐసీకి అప్పగించి పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రత్యక్షంగా 10 వేల ఉద్యోగాలు, పరోక్షంగా మరో 30 వేల ఉద్యోగాలు మొత్తం సుమారు 40 వేల వరకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయని వివరించారు. ఈ విషయమై రైతులు, కార్మికులు చర్చించుకుని తమ అభిప్రాయాలను తెలపాలని కోరారు. కార్మికులు తమకు చెల్లించాల్సిన రూ.24 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించేలా చూడాలని విన్నవించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ షుగర్ కేన్ జాన్ విక్టర్, రైతు సంఘాల నాయకుడు శ్రీనివాసులు టీవీవీ ప్రసాద్, షుగర్ ఫ్యాక్టరీ కార్మిక సంఘం అధ్యక్షుడు నారాయణ, షేర్ హోల్డర్లు, పలువురు రైతులు కార్మికులు పాల్గొన్నారు.

కుప్పకూలిన రియల్ ఎస్టేట్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రియల్ బూమ్

- కూటమి ప్రభుత్వం రాకతో మందగించిన క్రయవిక్రయాలు
- రియల్ వెంచర్లపై అధికార పార్టీ కమీషన్లు
- పెరిగిన ధరలు, అందని సంక్షేమ పథకాలు
- భూముల కొనుగోలుకు ముందుకురాని క్రయదారులు
- రిజిస్ట్రేషన్ విలువలు పెంపు మరో కారణం
- ఐదేళ్లలో 2024-25లోనే అత్యల్పంగా రూ.62.39 శాతం రాబడి

జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుప్పకూలిపోయింది. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని అటకెక్కించింది. ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడడంతో ఉద్యోగ, ఉపాధి రంగాలు కుదేలయ్యాయి. ధరల పెరుగుదల కట్టడిలో విఫలం కావడం, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ క్షీణించడం, వ్యాపార వృద్ధి పాతాళానికి పడిపోవడం వంటి కారణాలతో రాబడి కొరవడింది. మరో వైపు స్థానిక లీడర్ల నుంచి ఎమ్మెల్యే స్థాయి వరకు రియల్ వెంచర్లకు ముడుపుల టార్గెట్లు విధించడంతోపాటు తాజాగా ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ధరలు పెంచడం గోరుచుట్టుపై రోకటిపోటుగా మారింది.

నెల్లూరు సిటీ: రాష్ట్ర రాబడిలో కీలకంగా ఉండే రిజిస్ట్రేషన్ శాఖ లక్ష్య సాధనలో కుదేలైంది. ప్రభుత్వ పాలనా నిర్ణయాలు భూక్రయవిక్రయాలపై పెను ప్రభావం చూపుతున్నాయి. ఆయా రంగాలకు ఆయువు పట్టుగా ఉండే వ్యవసాయ రంగం కుప్పకూలిపోయింది. ఉద్యోగ, ఉపాధి, సంక్షేమం కరువు కావడం, మరో వైపు అన్ని వర్గాల ప్రజలపై జీవన వ్యయభారం పడడంతో స్థిరాస్తి కలలు కల్లలయ్యాయి.

జిల్లాలో 2019 నుంచి 2024 ఆర్థిక సంవత్సరాల వరకు క్రయవిక్రయాలను పరిశీలిస్తే ఏటా ప్రభుత్వ నిర్దేశించే రాబడి లక్ష్యంలో 70 శాతానికి తగ్గలేదు. కరోనా విలయతాండవం చేసిన 2020–21లో లక్ష్యంలో 79.90 శాతం రాబడి లభించింది. కరోనా సెకండ్ వేవ్ 2021–22లో అయితే ఏకంగా 94.67 శాతం రాబడిని ఈ శాఖ ఆర్జించింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలోనూ 93.33 శాతం లక్ష్యాన్ని సాధించింది.

గత ప్రభుత్వ పాలన స్వర్ణయుగమే..


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రెండేళ్ల కరోనా విపత్తు రాష్ట్ర రాబడిని కుప్పకూల్చేసినా.. మరో వైపు విస్తారంగా వర్షాలు కురవడంతో ప్రభుత్వ ప్రోత్సాహంతో వ్యవసాయ రంగం ఉవ్వెత్తున ఎగిసింది. మార్కెట్లో వ్యవసాయ ఉత్పత్తులకు గణనీయమైన ధరలు లభించడంతో ప్రజల రాబడి మరింతగా పెరుగుదలకు కారణమైంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రభుత్వం వెన్నుతట్టి ప్రోత్సహించింది. ఆయా పరిశ్రమలకు రాయితీలు, ప్రోత్సాహాలు కల్పించడంతో ఉద్యోగ, ఉపాధి మెరుగు పడింది. మరో వైపు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలకు నాంది పలకడం, విద్య, వైద్యానికి చేయూతగా నిలబడడంతో ప్రజల జీవన వ్యయాలు తగ్గడంతో రాబడులు పెరగడం వంటి పరిణామాలు స్థిరాస్తి కొనుగోళ్లను ప్రభావితం చేశాయి.

ఐదేళ్లు కళకళలాడిన రిజిస్ట్రార్ కార్యాలయాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఊరూరా ప్రైవేట్ లేఅవుట్లను తలపించే రీతిలో జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. దీంతో వాటికి సమాంతరంగా సమీపంలో కొత్తగా వెంచర్లు, హై అండ్ లో ప్రొఫైల్ స్థాయిలో గేటెడ్ కమ్యూనిటీలు ఏర్పాటయ్యాయి. క్రయవిక్రయాలతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు నిత్యం కళకళలాడుతుండేవి.

కూటమి పాలనలో..

అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి భూముల రిజిస్ట్రేషన్లు అమాంతంగా పడిపోయాయి. స్థానికంగా కూటమి నేతల నుంచి ఎమ్మెల్యేల స్థాయి వరకు రియల్ వెంచర్లపై రాబందుల్లా పడ్డారు. ఎకరాకు ఇంత వాటా ఇవ్వాలంటూ ఒత్తిళ్లు పెంచారు. తమ ప్రత్యర్థుల వెంచర్లు అయితే ఏకంగా సరైన అనుమతులు లేవంటూ ధ్వంసం చేశారు. గతంలో ఎప్పుడో కొనుగోలు చేసిన కట్టుకున్న ఇళ్లకు బెటర్‌మెంట్ కట్టాలంటూ నోటీసులు జారీ చేయించారు. అనేక వెంచర్లపై లోకాయుక్త వంటి న్యాయస్థానాల్లో ఫిర్యాదులు చేయించడానికి తెగించారు. మొత్తం మీద రెడ్‌బుక్ రాజ్యాంగం నడపడంతో భూములను అమ్మేవారు ఉన్నా.. కొనేవారు లేక రియల్ ఎస్టేట్ కుదేలైంది. ఇది చాలదన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం మరో బాదుడుకు శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి భూముల రిజిస్ట్రేషన్ విలువలను పెంచింది. ఈ క్రమంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో అత్యల్పంగా కేవలం 62.39 శాతం మాత్రమే రిజిస్ట్రేషన్లు జరిగాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నెల్లూరు జిల్లాలో మొత్తం 15 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. ప్రతి రోజూ జిల్లాలో కనీసం 150 నుంచి 350కి పైగా భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. నెల్లూరులోని ఆర్‌ఓ కార్యాలయంలో అత్యధికంగా రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. జాతీయ రహదారి కనెక్టివిటీలోని కావలి, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం, నెల్లూరు, బుజబుజనెల్లూరు ప్రాంతాల్లో అత్యధికంగా రిజిస్ట్రేషన్లు జరుగుతుండేవి. అయితే ఇప్పుడు పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. క్రయ, విక్రయాలు లేక రియల్టర్‌లు తలలు పట్టుకుంటున్నారు.



అల్లీపురం లేఅవుట్‌లో విక్రయానికి నోచుకోని ఇళ్లు

ఆర్థిక సంవత్సరం	లక్ష్యం (రూ.లక్షల్లో)	సాధించింది (రూ.లక్షల్లో)	శాతం	రిజిస్ట్రేషన్లు
2019-20	30,007.48	22,213.20	74.03	62,930
2020-21	29,117.31	23,264.65	79.90	65,036
2021-22	35,664.17	33,761.57	94.67	1,18,787
2022-23	46,674.58	43,561.62	93.33	1,42,348
2023-24	66,975.63	48,034.65	71.72	1,88,229
2024-25	71,238.22	44,448.25	62.39	93,772

అటు లేవుట్‌ల్లో ప్లాట్లు.. ఇటు నిర్మించిన ఇళ్లు

జిల్లాలో రియల్ ఎస్టేట్ బాగుంటుందని హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నుంచి రియల్టర్లు లేఅవుట్‌లు వేశారు. బిల్డర్లు ఆయా లేవుట్లలో అన్ని సదుపాయాలతో ఇళ్ల నిర్మాణాలు కూడా చేశారు. అయితే ఇప్పుడు ఆయా లేఅవుట్లలో భూములు కొనేవారు లేక రియల్ ఎస్టేట్ పడిపోయింది. రూ.కోట్లు ఖర్చు చేసి ఇళ్ల నిర్మాణాలు చేసినా కొనుగోలు లేక గత 9 నెలల నుంచి ఖాళీగా పెట్టుకున్నారు. కొందరు బిల్డర్లు నూతనంగా నిర్మించిన ఇళ్లను విక్రయించలేక బాడుగలకు ఇస్తున్న పరిస్థితి ఏర్పడింది. భారీగా వడ్డీలు చెల్లించాల్సి రావడంతో లబోదిబోమంటున్నారు.

స్థలాలు కొనేవారు తగ్గారు



నెల్లూరులో స్థలాలు అమ్మేవారు ఉన్నా, కొనేవారు లేకపోవడంతో రియల్ ఎస్టేట్ కుదేలైంది. గతంలోని ధరలకు విక్రయించలేక, ధరలను తగ్గించుకోలేక భూ యజమానులు నిరీక్షిస్తున్నారు.

– సాజిద్, కోవూరు

ధరలు తగ్గుతాయని వేచి చూస్తున్నా



ఇల్లు కొనాలనే ఆలోచన ఉంది. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ లేకపోవడంతో మళ్లీ కొందామని వేచి చూస్తున్నాను. ధరలు ఇంకా తగ్గుతాయని అనుకుంటున్నాను.

– అమర్‌నాథ్ సింగ్, స్టోన్‌హౌస్‌పేట

2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో రిజిస్ట్రేషన్ల వివరాలు

ఎస్‌ఆర్‌ఓ	లక్ష్యం (రూ.లక్షల్లో)	సాధించింది (రూ.లక్షల్లో)	శాతం	రిజిస్ట్రేషన్లు
కందుకూరు	3,445.73	2,173.10	63.07	8,600
అల్లూరు	848.22	703.78	82.97	3,603
ఆత్మకూరు	1,422.15	1,131.94	79.59	6,469
బుచ్చిరెడ్డిపాళెం	2,894.65	1,917.27	66.24	6,469
ఇందుకూరుపేట	2,435.31	1,700.19	69.81	4,477
కావలి	8,180.57	4,705.04	57.51	11,062
కోవూరు	2,584.71	2,285.35	88.41	5,699
ముత్తుకూరు	3,600.29	3,195.13	88.75	5,741
పొదలకూరు	1,718.93	998.07	58.06	4,985
రాపూరు	884.54	445.39	50.35	1,867
ఉదయగిరి	914.31	710.31	77.69	3,726
వింజమూరు	1,783.84	1,070.64	60.02	4,780
నెల్లూరు(ఆర్‌ఓ)	25,587.16	14,370.66	56.16	15,726
స్టోన్‌హౌస్‌పేట	10,361.96	5,945.25	57.38	7,768
బుజబుజనెల్లూరు	4,575.85	3,096.32	67.67	4,512

వినండి సారూ.. వెతలు తీర్చాలి మీరు

- వారం వారం వెల్లువెత్తుతున్న వినతులు
- ఈ వారం ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 583 అర్జీలు



ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: మా గోడు వినమంటూ అర్జీదారులు కలెక్టరేట్‌కు పోటెత్తుతున్నారు. వారం వారం అర్జీలు సంఖ్య పెరుగుతోంది. ఈ సోమవారం అయితే ఏకంగా ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 583 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ ఆనంద్‌తోపాటు డీఆర్‌ఓ ఉదయభాస్కర్‌రావు, డ్వామా పీడీ గంగాభవాని, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ విద్యారమ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూకు సంబంధించి 245, మున్సిపల్ శాఖకు సంబంధించి 39, సర్వేకు 51, పంచాయతీరాజ్ శాఖకు 43, పోలీసు శాఖకు సంబంధించి 94 అర్జీలు అందాయి.

భూమి ఆక్రమించారు

నెల్లూరురూరల్ మండలంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో కొత్తూరు బిట్–2లో సర్వే నబర్లు 2173, 2174లో కండలేరు ముంపువాసులకు 2021లో 150 మందికి ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. ఈ స్థలాల్లోని బావులను పూడ్చేసి ఈ మధ్య కొందరు ఆక్రమించారని, ఆ కాలనీవాసులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యపై పలు మార్లు ఫిర్యాదు చేసినా క్షేత్రస్థాయిలో పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసి రమేష్ రెడ్డి కోరారు.

ఇంటి పన్ను పేరుతో అధికంగా వసూలు

మా ఇంటికి సంబంధించి పన్ను రూ.10 వేలు గత నెల 15వ తేదీన గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శికి చెల్లించానని, మరో రూ.2 వేలు ఫోన్‌పే చేయించుకున్నారని, కానీ తనకు రూ.1,423 మాత్రమే బిల్లు ఇచ్చారని, దీనిపై అడిగితే సమాధానం చెప్పడం లేదని బోగోలుకు చెందిన దుగ్గిరాల రోజ్‌మేరి అధికారులకు ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

భూసేకరణను ఆపాలి



భూసేకరణ నిలుపుదల చేయాలంటూ విన్నవిస్తున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య తదితరులు

కావలి మండలం ఆనెమడుగు, సర్వాయపాళెం మజారా గ్రామాల్లో దాదాపు 750 ఎకరాల భూసేకరణకు అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య పేర్కొన్నారు. ఆ భూములు తీసుకుంటే సుమారు 1200 కుటుంబాల ప్రజలకు జీవనోపాధి పోతుందన్నారు. ప్రధానంగా గీత వృత్తి కార్మికుల జీవనభృతి పోతే ఎలా బతకాలన్నారు. భూములు అప్పగించాలంటే గ్రామ సభల్లో 80 శాతం మంది ప్రజలు ఆమోదం కావాలన్నారు. ఇదంతా వదిలేసి ఫిబ్రవరిలో ఒక షెడ్యూల్, మార్చిలో ఒక షెడ్యూల్ ప్రకటించారన్నారు. బడా పారిశ్రామికవేత్తలకు భూములు కట్టబెట్టాలని చూడడం దారుణమన్నారు. తక్షణమే భూసేకరణ ఆపాలని గ్రామస్తులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఎస్సీ వర్గీకరణ ఆపాలి

రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణను నిలుపుదల చేయాలని మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీగా వచ్చి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ స్వర్ణా వెంకయ్య మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ శాతాన్ని పెరిగిన ఎస్సీ జనాభా శాతం ప్రకారం పెంచాలన్నారు. హిందూ దేవాలయాల్లో అర్చకులుగా అన్ని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కలెక్టరేట్ ఎదుట ఎస్సీ వర్గీకరణకు సంబంధించి వ్యతిరేకిస్తూ మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.



ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌చార్జిలు

భయపడేది లేదు.. ఎదుర్కొంటాం

- మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇన్‌చార్జిలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కూటమి పాలకులు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అక్రమ కేసులు పెడుతూ బెదిరింపులకు పాల్పడితే భయపడే వారు ఎవరూ లేరు. వైఎస్సార్‌సీపీ ప్రతి కార్యకర్తకు, నాయకుడితోపాటు మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి తామంతా అండగా ఉంటామని జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఎమ్మెల్సీలు సంఘీ భావాన్ని తెలియజేశారు. నెల్లూరు ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాకాణిపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలతో తప్పుడు కేసులు పెట్టడం, కోర్టులు స్పందించేలోపు మరో మరో కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. కాకాణి దాక్కోవాల్సిన పనిలేదన్నారు. ఇప్పటికే కాకాణి మీద 7, 8 కేసులు ఉన్నాయన్నారు. అవినీతిని ప్రశ్నించే ఒకే ఒక్క గొంతును నొక్కాలని చూస్తే వైఎస్సార్‌సీపీ దీటుగా ఎదుర్కొంటుందన్నారు.

కూటమివి దొడ్డిదారి రాజకీయాలు

జిల్లాలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నేతలపై కేసుల పరంపర చూస్తే కూటమి దొడ్డిదారి రాజకీయాలు చేస్తుందని వెంకటగిరి ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కేసుల్లో సత్తా లేక చిల్లర కేసులతో వేధింపులకు దిగే స్థాయి దిగజారిపోయిందన్నారు. వెంకటగిరి మున్సిపల్ కౌన్సిల్ విషయంలో కూడా అధికార దుర్వినియోగం జరుగుతుందన్నారు. వెంకటగిరి, సైదాపురంలో నాలుగేళ్ల కిందట ఏవో తప్పులు జరిగాయంటూ తప్పుడు కేసులు ఇప్పుడు పెట్టారన్నారు.

కూటమి మారకపోతే తీవ్ర పరిణామాలు

కూటమి ప్రభుత్వం పద్ధతి మార్చుకోకపోతే ప్రతి పరిణామాలకు సిద్ధంగా ఉండాలని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హెచ్చరించారు. ఎన్నికల ఫలితాల నుంచి దోపిడీలు, అక్రమాలు, అరాచకాలు మొదలు పెట్టిందన్నారు. వారు చేస్తున్న దోపిడీల నుంచి ప్రజల దృష్టి మరలించేందుకే అక్రమ కేసులన్నారు. కాకాణిపై అక్రమ కేసుతోపాటు, అట్రాసిటీ కేసు పెట్టించడం దుర్మార్గపు పాలన అన్నారు. పోలీసులు సైతం కొంచెం జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

నిరాధార కేసులపై పోరాటం

నిరాధారమైన కేసులు పెడితే లెక్క చేసే వ్యక్తిత్వం కాకాణిది కాదని ఎమ్మెల్సీ మేరిగ మురళీ అన్నారు. అట్రాసిటీ కేసుపై సుప్రీం కోర్టు స్పష్టత ఇచ్చిందని, ఆధారాలు లేకుండా కేసు పెడితే కేసు రుజువు కాకపోతే ఆ తప్పుడు కేసు పెట్టిన వారిపై కూడా కఠినమైన చర్యలు ఉంటాయని తెలుసుకోవాలన్నారు. అట్రాసిటీ కేసు వాడుకోవాలని చూడడం న్యాయస్థానాలను తప్పుదోవ పట్టించడమేనన్నారు.

భవిష్యత్‌లో అనుభవించక తప్పదు

తప్పుడు కేసులు బనాయించిన కూటమి ప్రభుత్వం నాయకులు, అధికారులు భవిష్యత్‌లో వాటి ప్రతి పరిణామాలు ఫలితాలు అనుభవించక తప్పవని డీసీసీబీ మాజీ చైర్మన్ కె. సత్యనారాయణరెడ్డి అన్నారు. తనపై కూడా 11 కేసులు పెట్టారన్నారు. వీరి చలపతి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహా.. కాపాడయ్యా.. !

మాలకొండలో వెలసిన మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు దోపిడీకి గురవుతున్నారు. ప్రత్యేకంగా ప్రతి శనివారమే దర్శనభాగ్యాన్ని కల్పిస్తుండటంతో రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచీ భారీగా తరలివస్తారు. దీన్ని తమ ఆదాయ వనరుగా మార్చుకుంటున్న కొందరు.. టెండర్లకు విరుద్ధంగా పూజా సామగ్రిని అధిక ధరలకు విక్రయిస్తూ భక్తుల జేబులను ఖాళీ చేయడంలో తలమునకలై ఉన్నారు. ఇంత జరుగుతున్నా, చోద్యం చూడటం ఆలయాధికారుల వంతవుతోంది.

- మాలకొండలో భక్తుల నిలువుదోపిడీ
- టెంకాయ రేటు రూ.100, పూల దండ రూ.300
- టెండర్ల నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న వ్యాపారులు
- చోద్యం చూస్తున్న అధికారులు


మాలకొండపై టెంకాయల దుకాణాలు

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండలో వెలసిన మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. ఇలాంటి పుణ్యక్షేత్రంలో ఎన్నడూ లేని విధంగా పూజా సామగ్రి ధరలు పెంచి విక్రయాలు సాగిస్తున్నారు. దుకాణాలకు సంబంధించిన టెండర్లను అధికార పార్టీ వారే చేజిక్కించుకున్నారు. ఫలితంగా భక్తుల నిలువు దోపిడీ అధికార పార్టీ కనుసన్నల్లో జరుగుతోంది.

దోపిడీ ఇలా..

టెంకాయను రూ.100కు, పూల దండను రూ.300కు విక్రయిస్తున్నారు. గత వారం వరకు టెంకాయ, అరటిపండు, పూలు, పసుపు, కుంకుమ, కడ్డీలు, కర్పూరం కలిపి రూ.50, పూల దండ రకాన్ని బట్టి రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయించే వారు. తాజాగా ఈ శనివారం రెండు, మూడొంతుల మేర పెంచారు. వాస్తవానికి దేవాలయ నిబంధనల మేరకు 12 అంగుళాల చుట్టు కొలత కలిగిన టెంకాయను రూ.30కు విక్రయించాలి. ఇదే అంశాన్ని బహిరంగ వేలం పాట సమయంలో ఆలయాధికారులు స్పష్టంగా తెలియజేశారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా వేలందారులు ఒక్కో టెంకాయను రూ.100కు విక్రయిస్తూ భక్తుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. దుకాణం ముందు పెద్ద అక్షరాలతో రూ.30 అని పేర్కొన్నా, రూ.100కు విక్రయించడంపై భక్తులు మండిపడుతున్నారు.

కొంటే కొనండి..

రాష్ట్ర నలుమూలల నుంచి ప్రతి శనివారం సుమారు పది వేల మంది వరకు భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. ప్రస్తుత ధరలపై ప్రశ్నించే భక్తులతో వ్యాపారులు ఘర్షణకు దిగుతున్నారు. ఇక్కడ ఇవే ధరలు.. కొంటే కొనండి.. లేకపోతే వెళ్లండని తెగేసి చెప్తున్నారు. చేసేది లేక కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది. న్యాయం చేయాల్సిన అధికారుల చోద్యం చూస్తుండటంపై భక్తులు మండిపడుతున్నారు.

ఎన్నడూ ఈ రేట్లు లేవు



మాలకొండపై ఎన్నడూ లేని విధంగా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. టెంకాయ ధర రూ.వందా..? ఈ రకంగా వ్యవహరిస్తే వీటిని కొనడం కష్టమే. దీనిపై అధికారులు దృష్టి సారించాలి.
– చవిడిబోయి బ్రహ్మయ్య, కాకర్లపాళెం

ఈ ధరలను ఎప్పుడూ చూడలేదు

మాలకొండ దేవాలయంపై ఈ తరహాలో ధరలను ఎప్పుడూ చూడలేదు. గత శనివారమే టెంకాయ, పూలమాలల ధరలను పెంచారు. టెంకాయి రూ.వంద అంటే ఎలా కొనాలి. బోర్డులో రూ.30 అని పేర్కొన్నా, ఈ రకంగా వసూలు చేస్తున్నారు.
– ఝాన్సీ

పరిశీలించి చర్యలు చేపడతాం

టెంకాయలు, పూల దండలను అధిక ధరలకు విక్రయిస్తున్నారనే అంశం నా దృష్టికొచ్చింది. పరిశీలించి చర్యలు చేపడతాం. అప్పటికీ వినకపోతే టెండర్‌ను రద్దు చేస్తాం.
– సాగర్‌బాబు, డిప్యూటీ కమిషనర్

సమస్యలు పరిష్కరించండి మహాప్రభో..


డీఎస్పీ సింధుప్రియకు సమస్యను తెలియజేస్తున్న బాధితుడు

- పోలీస్ అధికారులకు బాధితుల వినతి

నెల్లూరు(క్రైమ్): వివిధ సమస్యలపై క్షేత్రస్థాయిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని, మీరైనా విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితులు అభ్యర్థించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి 100 మంది హాజరై తమ సమస్యలను వినతుల రూపంలో ఏఎస్పీ సౌజన్యకు అందజేశారు. చట్ట పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని ఆయా ప్రాంత పోలీస్ అధికారులను ఆమె ఆదేశించారు. పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సూచించారు. నగర డీఎస్పీ సింధుప్రియ, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణరక్షణ కల్పించండి

వేదాయపాళెంలోని ఆస్తిలో ఎనిమిదంకణాలు, పది దుకాణాలను నా తండ్రి సయ్యద్ హుస్మాన్ జానీ తన తదనంతరం నాకు చెందేలా 2009లో సెటిల్‌మెంట్ డీడ్ రాశారు. నా అన్న షాజిద్ వద్ద తండ్రి ఉండేవారు. ఆయన ఆరోగ్య రీత్యా, అవసర నిమిత్తం దుకాణ బాడుగలను షాజిద్ తీసుకుంటూ వచ్చారు. గత నెల ఐదున తండ్రి మరణించారు. దుకాణాలకు సంబంధించిన బాడుగలివ్వాలని షాజిద్‌ను కోరగా, వీటిని అడిగితే రౌడీలతో చంపిస్తానని బెదిరిస్తున్నారు. ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని చిన్నబజార్‌కు చెందిన సయ్యద్ షకీల్ ఫిర్యాదు చేశారు.

కుమారుడు వేధిస్తున్నాడు..

నా పేరుపై ఉన్న పొలాన్ని పెద్ద కుమారుడు సునీల్ తెలియకుండా విక్రయించారు. ఇదేమని ప్రశ్నిస్తే ఇబ్బందులకు గురిచేస్తున్నారని మనుబోలుకు చెందిన ఓ వృద్ధుడు ఫిర్యాదు చేశారు.

ఆస్తి పంచకపోతే వెళ్లిపోమంటున్నారు..

ఆస్తిని పంచాలని, లేకపోతే ఇంట్లో నుంచి వెళ్లిపోమంటూ నన్ను, నా భార్యను పెద్ద కుమారుడు కార్తీక్ చిత్రహింసలు పెడుతున్నారని ఆత్మకూరుకు చెందిన ఓ వృద్ధుడు కన్నీటి పర్యంతమయ్యారు.

ఉద్యోగం పేరిట మోసగించారు..

ఇరిగేషన్ శాఖలో ఉద్యోగమిప్పిస్తానని నమ్మించి రూ.ఎనిమిది లక్షలను బీవీనగర్‌కు చెందిన రమేష్ రెడ్డి తీసుకున్నారు. అయినా ఎలాంటి పురోగతి లేకపోవడంతో నిలదీయగా, కులంపేరుతో దూషించి చంపుతామని బెదిరిస్తున్నారు. విచారణ జరిపి న్యాయం చేయాలని కోవూరుకు చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.

నిందితులపై చర్యలకు వినతి

బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగమిప్పిస్తానని నమ్మించి రూ.4.35 లక్షలను హైదరాబాద్‌కు చెందిన అరవింద్, శ్రీకాంత్, అభిషేక్ తీసుకొని మోసగించారు. విచారణ జరిపి చర్యలు చేపట్టాలని వేదాయపాళేనికి చెందిన ఓ యువకుడు ఫిర్యాదు చేశారు.

పెళ్లి చేసుకుంటానని ముఖం చాటేశారు..

ప్రేమిస్తున్నానని.. పెళ్లి చేసుకుంటానని ముసునూరుకు చెందిన చంద్రకాంత్ నమ్మించారు. దీంతో ఇద్దరం దగ్గరయ్యాం. అవసరమని నా వద్ద రూ.మూడు లక్షలు తీసుకున్నారు. పెళ్లి చేసుకోవాలని కోరగా, ముఖం చాటేశారు. విచారణ జరిపి చర్యలు చేపట్టాలని గుడ్లూరుకు చెందిన ఓ యువతి ఫిర్యాదు చేశారు.

కౌన్సిల్ సమావేశం రసాభాస

- బుచ్చిరెడ్డిపాళేనికి నుడా నుంచి రూ.కోటి కేటాయింపు
- టీడీపీకి మద్దతు తెలిపిన 10 మంది కౌన్సిలర్లకు అభివృద్ధి నిధులు
- ఏకపక్షంగా కేటాయించడంపై వైఎస్సార్‌సీపీ నిలదీత
- వాకౌట్ చేసిన వైనం


చైర్‌పర్సన్, కమిషనర్‌ను నిలదీస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

బుచ్చిరెడ్డిపాళెం(కోవూరు): బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వాదాలతో రసాభాసగా మారింది. కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. 38 అంశాలతో అజెండాను కౌన్సిల్ ఆమోదం కోసం పెట్టారు. నగర పంచాయతీ అభివృద్ధికి రూ.కోటిని నుడా కేటాయించింది. ఈ క్రమంలో టీడీపీకి మద్దతుగా నిలిచిన 10 మంది కౌన్సిలర్లకు సంబంధించిన వార్డుల్లో వివిధ అభివృద్ధి పనులకు వీటిని కేటాయిస్తూ తీర్మానాన్ని ప్రతిపాదించారు. దీన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు తప్పుబట్టారు. తమ వార్డుల్లో అనేక సమస్యలున్నాయని, నిధులు కేటాయించాలంటూ ముందుగానే ప్రతిపాదనలు చేశామని నిలదీశారు. చైర్‌పర్సన్ ఏకపక్ష నిర్ణయాలను ఖండించారు. అజెండాలోని అంశాలపై చర్చించాలని చైర్‌పర్సన్ కోరగా, తాము వాకౌట్ చేస్తున్నామని, మీరే చర్చించుకొని ఆమోదించుకోవాలని స్పష్టం చేశారు.

38 అంశాలతో అజెండా

నగర పంచాయతీకి సంబంధించిన 38 అంశాలతో అజెండాను పొందుపర్చారు. నగర పంచాయతీ సాధారణ నిధులతో బుచ్చిరెడ్డిపాళెం పరిధిలో ఫాగింగ్, స్ప్రే చేసేందుకు అవసరమైన కెమికల్స్ కొనుగోలుకు రూ.1.5 లక్షలు, గృహ నిర్మాణాలు తదితరాలను కౌన్సిల్ ఆమోదం కోసం ప్రతిపాదించారు.

ఎమ్మెల్యే పర్యటనలపై సమాచారమేదీ..?

స్థానిక కౌన్సిలర్లకు సమాచారం లేకుండా వార్డుల్లో ఎలా పర్యటిస్తారని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని కౌన్సిలర్ షాహుల్ ప్రశ్నించారు. సమాచారమివ్వకుండా షెడ్యూల్‌ను ఖరారు చేయడంపై కమిషనర్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష కౌన్సిలర్లకు తమ సమస్యలను తెలియజేసే అవకాశం కల్పిస్తామంటూ కారెక్కి ఆమె వెళ్లిపోయారు.

అజెండా ఆమోదం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు వాకౌట్ చేసిన అనంతరం అజెండా అంశాలను ఏకవాక్యంతో చైర్‌పర్సన్ ఆమోదిస్తూ తీర్మానం చేశారు. మిగిలిన కౌన్సిల్ సభ్యులూ ఆమోదం తెలిపారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన వైస్ చైర్మన్లు ప్రమాణ స్వీకారం చేశారు.

క్లుప్తంగా

మంత్రి జనార్దన్‌రెడ్డి రాక నేడు

నెల్లూరు(అర్బన్): ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కావలికి మంగళవారం రానున్నారు. నంద్యాల జిల్లా బనగానిపల్లె నుంచి బయల్దేరి మధ్యాహ్నం 1.30కు చేరుకోనున్నారు. ట్రంక్‌రోడ్డులో గ్రంథి యానాదిశెట్టి విగ్రహావిష్కరణలో మధ్యాహ్నం మూడుకు పాల్గొననున్నారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొని తాడేపల్లికి సాయంత్రం ఏడు గంటలకు పయనమవనున్నారు.

మైనింగ్ కేసులో విచారణకు హాజరు


విచారణ అనంతరం బయటకొస్తున్న ప్రభాకర్‌రెడ్డి


నెల్లూరు(క్రైమ్): రుస్తుం మైనింగ్ కేసులో వివిధ అంశాలపై ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డిని పోలీస్ అధికారులు విచారించారు. కేసు విచారణ నిమిత్తం నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి హాజరుకావాలంటూ ప్రభాకర్‌రెడ్డితో పాటు ఆయన తనయుడు చైతన్యరెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి చిన్నల్లుడు గోపాలకృష్ణారెడ్డికి నోటీసులను పోలీసులు ఇటీవల జారీ చేశారు. దీంతో ప్రభాకర్‌రెడ్డి తన న్యాయవాదితో కలిసి విచారణకు సోమవారం ఉదయం 11 గంటలకు హాజరయ్యారు. మైనింగ్‌కు సంబంధించిన వివిధ అంశాలపై అరగంటపాటు విచారించారు. మిగిలిన ఇద్దరూ హాజరుకాలేదు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

నెల్లూరు(క్రైమ్): పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తూ రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన విజయమహల్ గేట్ వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మృతుడు సుమారు 60 నుంచి 65 ఏళ్లలోపు వయస్సు కలిగి.. తెలుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, తెలుపు రంగు పంచెను ధరించి ఉన్నారు. ఘటన స్థలాన్ని నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.110
లేయర్	రూ.100
బ్రాయిలర్ చికెన్:	రూ.198
స్కిన్‌లెస్ చికెన్:	రూ.220
లేయర్ చికెన్:	రూ.170




స్నేహితురాలి గొంతుకోసిన వ్యక్తి

నెల్లూరు(క్రైమ్): స్నేహితురాలి గొంతు కోసిన వ్యక్తిపై కేసును సంతపేట పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బోడిగాడితోటకు చెందిన ఓ మహిళ భర్త చనిపోయారు. సంతపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వైన్‌షాప్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్న ఆమెకు కపాడిపాళేనికి చెందిన రమేష్‌తో పరిచయమైంది. ఇద్దరూ కలిసి కొంతకాలంగా సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో తన చెల్లెలి వద్ద ఆమెకు కొంత నగదును అప్పుగా రమేష్ ఇప్పించారు. ఈ తరుణంలో రమేష్ పూటుగా మద్యం సేవించి వైన్ షాపు వద్దకు ఆదివారం వచ్చి, తన చెల్లెలికి డబ్బులు ఎప్పుడిస్తావంటూ నానా దుర్భాషలాడారు. దీంతో ఆమె అక్కడి నుంచి వెళ్తుండగా, అడ్డుకొని చాకుతో గొంతుకోసి పరారయ్యారు. గాయపడిన ఆమె చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేరారు. దీనిపై పోలీసులకు బాధితురాలు ఆదివారం అర్ధరాత్రి ఫిర్యాదు చేశారు. హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడ్ని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారని సమాచారం.

నిమ్మ ధరలు

పెద్దవి: రూ.110
సన్నవి: రూ.90
పండ్లు: రూ.60



మాతృభాషలో మాట్లాడటాన్ని అలవర్చుకోవాలి

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు


మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

వెంకటాచలం: మాతృభాషలో మాట్లాడటాన్ని విద్యార్థులు అలవాటు చేసుకోవాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో విద్యార్థులతో సోమవారం నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీవితంలో పాటించాల్సిన కొన్ని ముఖ్యమైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యాలయాలు, ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. మాతృభాషలో మాట్లాడటం చాలా ముఖ్యమని, ఇది కంటి చూపైతే, ఇంగ్లిష్ భాష కళ్లద్దం లాంటిదని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్‌ను పరిమితంగా వాడితే ఆరోగ్యానికి మంచిదన్నారు. గురువును మించింది గూగుల్ కాదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. కన్న తల్లి, జన్మభూమి, మాతృభాషను ఎప్పటికీ మర్చిపోకూడదని పేర్కొన్నారు. అనంతరం పాటలు, పద్యాలతో అలరించిన విద్యార్థినులకు నగదు బహుమతులను అందజేసి అభినందించారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం


శిక్షణకు హాజరైన వారితో రామనారాయణరెడ్డి

ఆత్మకూరు: రాష్ట్రంలోని మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. పట్టణ పరిధిలో 247 మంది నమోదు చేసుకోగా, తొలి బ్యాచ్ కింద 95 మందికి శిక్షణ ఇచ్చి కుట్టు మెషీన్లను అందజేయనున్నామని వెల్లడించారు. నియోజకవర్గంలో పది వేల ఇళ్లకు సూర్యఘర్ అవకాశాన్ని కల్పించనున్నామని ప్రకటించారు. ఆర్డీఓ పావని, బీసీ కార్పొరేషన్ అధికారి నిర్మలాదేవి, కమిషనర్ గంగాప్రసాద్, చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ సర్దార్, సీడీపీఓ సునీలత, పులిమి శైలజ, చంద్రారెడ్డి, బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థిని ఆచూకీ లభ్యం

ఆత్మకూరు: అదృశ్యమైన ఏఎస్‌పేట మండలం రాజవోలుకు చెందిన డిగ్రీ విద్యార్థిని ఆచూకీ లభ్యమైంది. వివరాలు.. తోటి విద్యార్థి భరణీధర్ మాయమాటలతో ఇంటి నుంచి ఫిబ్రవరి 26న ఆమె అదృశ్యమయ్యారు. దీనిపై ఏఎస్‌పేట పోలీస్ స్టేషన్లో మరుసటి రోజే తల్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు సక్రమంగా విచారణ చేయలేదని, 40 రోజులైనా కుమార్తె ఆచూకీ తెలియకపోవడంతో డీఎస్పీని కలిసేందుకు బంధువులతో కలిసి రెండు రోజుల క్రితం ఆమె వచ్చారు. అయితే ఆయన అందుబాటులో లేకపోవడంతో సీఐ గంగాధర్‌కు అర్జీని అందజేశారు. వెంటనే ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి 24 గంటల వ్యవధిలోనే అమ్మాయితో పాటు భరణీధర్‌ను హైదరాబాద్‌లో పట్టుకొని ఆత్మకూరుకు సోమవారం తీసుకొచ్చారు. విచారణ అనంతరం యువతిని తల్లిదండ్రులకు అప్పగించారు. కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఎస్సై జిలానీ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో విచారణ.. రోగుల అవస్థ


గేట్‌ను మూసేసి పహారా కాస్తున్న పోలీసులు

జలదంకి: స్థానిక పీహెచ్‌సీలో జరిగిన అవినీతి, ల్యాబ్ టెక్నీషియన్ రసూల్‌కు 18 నెలలుగా జీతం పెట్టకుండా ఇబ్బంది పెడుతున్న విషయమై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఆదేశాల మేరకు విచారణను జిల్లా కుష్టు, క్షయ నివారణాధికారి ఖాదర్‌వలీ సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నిర్వహించారు. ఈ క్రమంలో ఓపీ జరగకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయడంతో అనారోగ్య సమస్యలతో వచ్చిన వారు ఇబ్బంది పడ్డారు. నాగిరెడ్డిపాళేనికి చెందిన ఒక వ్యక్తి కుక్కకాటుకు గురై వచ్చినా, ఆయన్ను లోపలికి అనుమతించలేదు. జలదంకి పీహెచ్‌సీలో అభివృద్ధి నిధుల్లో గోల్‌మాల్ జరిగిందని, వైద్యసేవలు సక్రమంగా అందడంలేదని, ల్యాబ్ టెక్నీషియన్‌ను వేధింపులకు గురిచేస్తున్నారనే అంశాలపై పత్రికల్లో కథనం ప్రచురితమైంది. దీంతో విచారణ సాగింది.

ప్రాణం తీసిన ఈత సరదా

దంతాలపల్లి: ఈత సరదా ఓ యువకుడి ప్రాణాన్ని బలిగొన్న ఘటన తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. దంతాలపల్లికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు శ్రీనివాస్ రాజ్ వద్ద మేస్త్రీగా జిల్లాలోని నరసాపురానికి చెందిన ఏడుకొండలు(25) నెల రోజులుగా పని చేస్తున్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం పనిలేకపోవడంతో రూమ్‌లోనే ఉన్నారు. ఈతకెళ్తానని సహచరులకు చెప్పి సాయంత్రం నాలుగు గంటల సమయంలో బయటకెళ్లారు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో గాలింపు చర్యలను సహచరులు చేపట్టారు. ఈ క్రమంలో ఎస్సారెస్పీ కాలువలో మృతదేహాన్ని గమనించిన రైతులు పోలీసులకు సోమవారం సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని ఏడుకొండలుదిగా గుర్తించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులు వచ్చిన అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నామని ఎస్సై రాజు తెలిపారు.